# అల, తల, వల

## అల

సాయంత్రం-శ్రద్ధానందఘాటు మెట్లమీద కూర్చుని దూరంగా కనపడే కొవ్వూరు తీరరేఖను, బ్రిడ్జికింద ఎగువకూ, దిగువకూ, తెల్లని తెరచాపలతో జారే నావలను చూస్తున్నాను.

సందెగాలికి రేగిన నల్లని గోదావరి నీళ్ళలో అలల గల గల - ఒక గాయని లోలోపల సంగీతం "హమ్" చేస్తూన్నట్టు.

మార్కండేయ స్వామి గుడిలో ఉండి ఉండి గంటలు. గట్టుమీద సరదాగా నడిచిపోయే ఒకటి రెండు జంటలు.

## తల

చుక్క తెగినట్టు పవనకుమార్ వచ్చి "అన్నగారూ నమస్కారం" అని చిరునవ్వుతో దగ్గర కూచున్నాడు.

ఆ నవ్వులో కాంతి లేదు.

పవనకుమార్ అంటే ఏం తెలుస్తుంది? పేరు పమిడి వరాహ నరసింహం. బొబ్బిలి, సాలూరు ప్రాంతం అనుకుంటాను. పిలకా, క్రాపూతో వచ్చి ఆర్నెల్ల కిందట ఒక ప్రైవేట్ స్కూల్లో చేరాడు.

వచ్చిన కొన్నాళ్ళకు పేరు సొగసుగా కత్తిరించి పవనకుమార్ చేశాడు. పిలక కత్తిరించి చెవులమీదికి గిరజాల క్రాఫ్ రానిచ్చాడు. లాల్చీ మెడ పక్కకు మార్చాడు. నన్నయ, శ్రీనాథుడు, రాయప్రోలు, వేదుల తాగిన గోదావరి నీళ్ళు తాగి పద్యాలు రాయడం ప్రారంభించాడు. సాయంత్రం షికార్లో గోదారిగట్టున కనపడే అందాలు చూసి కలలు కనడం అలవాటయింది. విగ్రహాలు, పీఠాదులమీద చిరాకు పుట్టి బ్రహ్మ సమాజం ప్రార్థనలకూ, శరణాలయం ఉత్సవాలకు వెళ్ళడం మొదలెట్టాడు. పాపం ఎందుకో నామీద అభిమానం. రాసిన పద్యం వినిపిస్తాడు. ఒకప్పుడు విశ్వనాథ రాతిగోపురాలు, కృష్ణశాస్త్రి నగిషీలు చేస్తూంటాడు. నవ్వుతూ "బాబూ! నువ్వు నువ్వుగా రాసిన పద్యం చదువు" అంటుంటాను. నవ్వుతాడు. మొత్తానికి కవిత్వం తిని అందాలు తాగే స్వప్నజీవిగా యెదిగాడు.

# వల

తమ్ముణ్ని ప్రశ్నార్థకంగా చూశాను.

చటుక్కున పవనకుమార్, "అహల్యలేకుండా బ్రతకలేను అన్నగారూ! ప్రేమ కలుగక బ్రతుకు చీకటి - అప్పారావుగారి ముక్క నిజం" అన్నాడు. నీళ్ళలోకి చూస్తూ— ఈ యువకులు ప్రపంచం అంతా బృందా వనం అనుకుంటారు. దారిలో ఎన్ని పాములూ; బాములూ ఉన్నాయో ఎరగరు. నెమ్మదిగా అడిగాను.

"ఎవరీ అహల్య?" పవన్ చెప్పడం ప్రారంభించాడు.

"శరణాలయంలో మహోత్సవాలకు వెళ్ళినప్పుడు విందు జరిగింది. వంటలు, వడ్డనలూ, శరణాలయం యువతులే. ఒకమ్మాయి పాయసం వడ్డిస్తూ పరధ్యానంగా వున్న నా చేతిమీద వడ్డించింది. పాయసం ఎంత తియ్యగా వున్నా చెయ్యి చుర్రుమనకుండా వుండదు గదా!

"అరే" అంటూ తలెత్తి చూశాను.

"తలంటి పోసుకుని వదులుగా అల్లిన జడ. కళ్ళల్లో నొచ్చుకున్న జాలి, పెదవుల్లో కొంటెనవ్వు. వానకడిగిన స్వచ్ఛమైన నల్లకలవ పువ్వులా వుంది.

"ఆ చేపకళ్ళ అందంచూస్తూ చేతిమంట మరిచిపోయి నవ్వాను. మాట్లాడకుండా మరికొంత పాయసం వడ్డించి ఒయ్యారంగా వెళ్ళిపోయింది. ఆ తియ్యని మంట మనస్సును ఒదలలేదు, మళ్ళా చూడలేదు. కొన్నాళ్ళు

గడిచాయి. హఠాత్తుగా నిన్న ఒక ఉత్తరం... నామీద ఆమెకుకూడా ప్రీతి ఉంది." "మీ సంగతి కష్టపడి తెలుసుకున్నాను. కారణాంతరాలవల్ల శరణాలయం విడిచి వెళ్ళిపోతున్నాను. రాత్రి పదకొండు గంటలకు రైలు దగ్గర కలుసుకుందాము, తప్పక వస్తారుగదా!" మీ అహల్య.

రైలు గంట లేటు. ప్లాట్‌ఫారం చివర చీకట్లో కూర్చున్నాం. రెండుచేతులూ నా బుజాలమీద వేసి ముఖం దగ్గరగా తీసుకుంది. నా మెడ మీద జలజల కన్నీటిబొట్లు. మెల్లగా తేరుకుని అంది. "ఆ నాటి విందులో మిమ్మల్ని చూసిన నాటినుంచీ మీరు రోజూ నావెంట వుండి పలకరిస్తూ న్నట్టే వుంది. నాకు యిక్కడ యింకొకరితో పెళ్ళి సిద్ధం చేస్తున్నారు. అతనితో నా కిష్టంలేదు. నేను మీ కులంకాదు. ధైర్యం వుంటే, మీతో వచ్చి పెళ్ళి చేసుకుంటాను. మీ వెన్నుబలం నాకు తెలియదు. మిమ్మల్ని పూర్తిగా ఇష్టపడుతున్నాను. సర్వం సమర్పించుకుంటున్నాను. లేదా వచ్చిన చోటికే వెళ్ళిపోతాను. అంటే కర్నూలు— చావు కాదు" అని తడిగా నవ్వింది.

నిలువునా కదిలిపోయాను.

నిజమైన ప్రేమకు ఎంత మూల్యం చెల్లించాలి ?

ఇంత ప్రేమను ఎలా పోగొట్టుకోను? ఎలా తీసుకోను? ఇంక నాకు మిగిలిందేమిటి ?

కులం, సంప్రదాయం, ముందు వెనకలు, ఏం కావాలి? మౌనం.... చీకటి... కొంచెం తేరుకుని మళ్ళా అంది :

"ఇద్దరికీ కొంత చదువుంది. అంతకుమించి మడతలు లేని మన స్సుంది. కర్నూలుకు టికెట్టు కొనండి. తుంగభద్ర నీళ్ళు తాగి బతుకుదాం"

చూస్తూండగానే రైలు వచ్చేసింది. ఇంజను వెలుగుతో పట్టాలు, ప్లాట్ఫారం నిండిపోయాయి.

తొలగిపోయిన చీకటి నాలో ప్రవేశించింది.

అడ్రసు కాగితం చేతిలోపెట్టి అహల్య చట్టున రైలెక్కింది. ఆ పిల్ల భుజాల సువాసన నా మెడలో మిగిలింది.

"నాలో నేను లేను. ఏం చెయ్యమంటారో చెప్పండి" స్తిమితంగా అన్నాడు.

"తమ్ముడూ, చిన్నప్పుడు చదువుకున్న అల, తల, వల, అమాయికమైన అక్షరాలు మాత్రమే. ఇప్పుడు వాటి నిజస్వరూపం ఏమిటో తెలుసునా? జీవితం అలతలవల అంటే విసుగువేసటల అల్లిక.

"పిలకా, పేరూ కత్తిరించి ఆధునికత స్థిరపరుచుకున్నావు. కాని మనస్సును కత్తిరించి ఆధునికం చెయ్యలేకపోయావు.

"దేశాన్ని ప్రేమించు. స్త్రీని ప్రేమించు. ధర్మాన్ని ప్రేమించు. కష్టాలలో కాలి తపించ గలిగినప్పుడే అందులో గెలుపు. ఆ సాహసం చొరవ ఉంటే అహల్య దగ్గరకు వెళ్ళిపో, లేకపోతే ఆ కల మరచిపో. సామాన్యులకు చొరరాని మార్గంలో అడుగుపెట్టకు. ఇంతే నా సలహా—"

అతని భుజంమీద చేయివేసి బుజ్జగిస్తూ అన్నాను. చీకటి, ప్రపంచం మీద వల విసిరి చుక్కల కాంతితో నవ్వుకుంది.